క్లుప్తంగా

14,15 తేదీల్లో గణపవరంలో వార్షికోత్సవాలు



నాదెండ్ల: గణపవరం–కావూరు డొంక రోడ్డులో కొలువై యున్న వీరాంజనేయ స్వామి వారి ఆలయ తృతీయ వార్షికోత్సవం ఈ నెల 14,15 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కాట్రు శ్రీనివాసరావు, ఆదిపూడి మల్లిఖార్జునరావు తెలిపారు. ఈ నెల 14న ఉదయం ఆలయ ప్రధానఅర్చకులు పరిమి లక్ష్మీనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో మంగళవాయిద్యాలతో సుప్రభాత సేవ, విఘ్నేశ్వరపూజ, కలశస్థాపన, నవగ్రహ మండపారాధన, పుష్పాలు, తమలపాకులతో అర్చన, అనంతరం ఉత్సవ మూర్తులకు నూతన వస్త్రధారణ గావించి కళ్యాణం నిర్వహించనున్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం, 15న ఉదయం ఏకనామ రుద్రాభిషేకం, అలంకరణ, అభిషేకాలు, గోత్రనామపూజలు నిర్వహించనున్నారు. అనంతరం భారీ అన్నదానం జరగనుంది. అదేరోజు మధ్యాహ్నం మహిళా కోలాట ప్రదర్శన నిర్వహించనున్నారు.

ఉప్పరపాలెంలో పొలం పిలుస్తోంది



వినుకొండ (నూజెండ్ల): వినుకొండ మండలంలోని ఉప్పరపాలెం రైతు సేవ కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా డీఆర్‌సీ డీడీఏ ఎం.శివకుమారి మాట్లాడుతూ వరి, కంది, మిరప, పొగాకు, పంటలను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని, మద్దతు ధరలు కొనుగోలు కేంద్రాల మీద రైతులకు అవగాహన కల్పించారు. మొక్కజొన్న పంట పొలాలను పరిశీలించి వాటిలో ఉన్న పురుగులు తెగుళ్ల గురించి రైతులకు వివరించారు. రబీలో పంట నమోదు చేసినటువంటి పొలాలను పరిశీలించడం జరిగింది. ప్రతి ఒక్క రైతు ఏపీ పార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా రైతు సేవ కేంద్రం వద్దకు వెళ్లి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేపించుకోవాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి. వరలక్ష్మి, ఏఈవో సునీత, వీఏఏ ఖాదర్ బాషా, రైతు సోదరులు పాల్గొన్నారు.

వాహనం అదుపు తప్పి డిగ్రీ విద్యార్థి మృతి



మృతుడు గుంటి రాజేష్ (ఫైల్)

నాదెండ్ల: స్కూటీ అదుపుతప్పి డిగ్రీ చదువుతున్న విద్యార్థి మృతి చెందిన సంఘటన మంగళవారం సాతులూరు– చందవరం రహదారిపై చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు చందవరం గ్రామానికి చెందిన గుంటి వసంతరావు, జోజమ్మ దంపతులకు ఇరువురు సంతానం. కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. పెద్ద కుమారుడు రాజేష్ (20) నరసరావుపేటలో డిగ్రీ బీకాం మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సాతులూరు స్కూటీపై తన మిత్రుడితో కలిసి స్వగ్రామంలో ఇంటికి వెళ్లే క్రమంలో చందవరం శివారులోని కేవీఎం ఆర్గానిక్స్ కంపెనీ వద్ద వాహనం అదుపుతప్పి కాలువలో పడింది. దీంతో రాజేష్ అక్కడికక్కడే మృతి చెందగా, మిత్రుడికి స్వల్పగాయాలయ్యాయి. రాజేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎన్నెన్నోో... కొత్త అందాలు!

- కోటప్పకొండకు నూతన సొబగులు
- అభివృద్ధి చేస్తున్న అటవీ శాఖ
- చిన్నారుల కోసం ఫన్ ఎరినా
- గిరి వన విహార్‌లో ఎనిమిది రకాల వనాలు
- 300 మీటర్ల పంచతత్వ నడకదారి

నరసరావుపేట రూరల్: రాష్ట్రంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న కోటప్పకొండను పర్యాటకంగా అభివృద్ధి చేసే దిశగా అటవీ శాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే కోటప్పకొండలోని ప్రకృతి పర్యాటక కేంద్రంతో పాటు నగరవనం యాత్రికులను ఆకట్టుకుంటోంది. స్వామి వారి దర్శనానికి వచ్చే యాత్రికులు తమ చిన్నారులతో ఉల్లాసంగా గడిపేందుకు ఫన్ ఏరినను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో పాటు స్వామి వారి అభిషేకానికి వినియోగించే వివిధ రకాల పుష్పాలతో కూడిన వనాన్ని అభివృద్ధి చేస్తోంది. పంచతత్వ నడకదారి పేరుతో గిరిప్రదక్షిణ దారిలో ఈ వనం యాత్రికులకు ప్రత్యేక అనుభూతిని అందించనుంది.

కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారి దేవస్థానానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుంటారు. మహాశివరాత్రి సందర్భంగా జరిగే తిరునాళ్లకు లక్షలాది మంది స్వామి దర్శనానికి వస్తారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారు సేద తీరేందుకు, కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడిపే విధంగా అటవీశాఖ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు చేపట్టింది. ఘాట్‌రోడ్డులోని ప్రకృతి పర్యావరణ కేంద్రం ఇప్పటికే భక్తులకు అందుబాటులో ఉంది. ఇక్కడ ట్రాయ్‌ట్రెన్, బోటు షికారు, అంక్వేరియం, నెమలివనం యాత్రికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నగరవనంలో ట్రెక్కింగ్, వ్యూ పాయింట్ ఉంది.



ఫన్ ఎరినా హోర్డింగ్

గిరి ప్రదక్షిణ దారిలో గిరి వన విహార్

గిరిప్రదక్షిణ దారిలో ఇప్పటికే గిరి బాల విహార్‌తో పాటు నగరవనం అభివృద్ధి చేశారు. దీంతో పాటు గిరి వన విహార్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఇక్కడే పంచతత్వ నడకదారిని ఏర్పాటు చేశారు. 300 మీటర్ల నడకదారిని ఆక్యుపంక్చర్ వైద్య విధానానికి దోహదపడేలా రూపొందించారు. ఈ నడకదారికి ఇరువైపులా త్రికోటేశ్వరునికి ప్రీతిపాత్రమైన దళాలు, పుష్పాలతో ఎనిమిది రకాల వనాలు ఉన్నాయి. నాగలింగ, ఉసిరి, మారేడు, రుద్రాక్ష, కదంబ, సంపంగి, మోదుగ వనాలతో పాటు పలు రకాల పుష్పాలతో పుష్ప వనం అభివృద్ధిపై అటవీశాఖ దృష్టిసారించింది. ఈ వనంలో యాత్రికులు సేదతీరే విధంగా పగోడాలు ఏర్పాటు చేశారు.



ఫన్ ఎరినాలో టేబుల్స్, ఆట వస్తువులు

చిన్నారుల కోసం..

ఘాట్ రోడ్డులోని ప్రకృతి పర్యావరణ కేంద్రంలో ఫన్ ఎరినాను అటవీశాఖ నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. చిన్నారుల కోసం ప్రత్యేకంగా దీనిని ఏర్పాటు చేశారు. జెంగా, చెస్, క్యారమ్స్, స్ట్రింగ్ హాకీ, స్లైడ్ పజిల్, షేప్ మ్యాచింగ్, మెమోరి చెస్, స్ట్రైక్ 4, ఫిష్ ఇట్ అవుట్, లూడో, సుడోకు తదితర ఆటలు ఆడుకునే విధంగా ఇక్కడ ఏర్పాట్లు చేశారు. ఏయిర్ కండిషన్ సెంటర్‌గా దీనిని అభివృద్ధి చేశారు. ఒక్కో వ్యక్తికి గంటకు రూ.25లు టికెట్ రేటుగా నిర్ణయించారు. పర్యావరణంపై యాత్రికులకు అవగాహన కల్పించే విధంగా డాక్యుమెంటరీ ప్రదర్శన చేస్తారు.

అవగాహన పెంచేలా చర్యలు



కొండకు వచ్చే యాత్రికులకు వినోదంతో పాటు పర్యావరణంపై అవగాహన పెంచేలా అటవీశాఖ చర్యలు చేపడుతోంది. ఫన్ ఎరినాలో సాంప్రదాయ ఆటలతో పాటు ప్రకృతిపై డాక్యుమెంటరీలు ప్రదర్శన ఉంటుంది. అలాగే గిరిప్రదక్షిణ నడకదారిలో వన విహార్‌లో వివిధ రకాలు వనాలు అభివృద్ధి చేయడం ద్వారా భక్తులకు వన సంరక్షణపై అవగాహన కల్పించవచ్చు.

–కృష్ణప్రియ, జిల్లా అటవీ అధికారి

ప్రశాంతంగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్స్‌లో జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్నారు. పల్నాడు జిల్లా పరిధిలో మంగళవారం ఉదయం 53 కేంద్రాలలో 3,067 మంది విద్యార్థులకు గాను 2,940 మంది విద్యార్థులు హాజరు కాగా మరో 127మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 51 కేంద్రాలలో నిర్వహించిన పరీక్షకు 2,442 మందికి గాను 2,364 మంది హాజరయ్యారు. మరో 78 మంది గైర్హాజరయ్యారు.

14న చిరుమామిళ్ళలో ఆలయాల వార్షికోత్సవం

నాదెండ్ల: చిరుమామిళ్ళ ఎస్టీ కాలనీలోని శివాలయం, నాదెండ్ల బైపాస్ రోడ్డులోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 14న నిర్వహిస్తున్నట్లు నడికట్టు రామిరెడ్డి సేవా సమితి సభ్యులు యన్నం శివారెడ్డి తెలిపారు. ఉదయం రెండు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గోత్రనామ పూజలు నిర్వహించనున్నారు. తీర్థప్రసాదాల వితరణ ఉంటుందన్నారు.

రైతుసేవా కేంద్రాల్లో రిజిస్టరు చేయించుకోవాలి

నాదెండ్ల: సొంత భూమి కలిగిన ప్రతి రైతు రైతు సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా రిజిస్టర్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్ తెలిపారు. భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రైతులకు అందే పీఎం కిసాన్, వ్యవసాయ పనిముట్లు, సబ్సిడీలు, విత్తనాలు, ఎరువులు, జాతీయ విపత్తులు సంభవించినపుడు రైతులకు అందించే నష్టపరిహారం రిజిష్టర్ చేసుకున్న రైతులకు అందుతుందన్నారు. ఈ ఏడాది మార్చి 25 వరకూ రిజిస్ట్రేషన్ కొనసాగుతుందన్నారు. సంబంధిత రైతులు ఆధార్ నెంబరుతో పాటూ లింకైన ఫోన్ నెంబరుతో హాజరై రిజిస్టరు చేయించుకోవాలని కోరారు.

ఆటో మీదపడి డ్రైవర్ మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డుపై పడిన డ్రైవర్‌పై ఆటో మీద పడి మృతి చెందిన ఘటన పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..యడ్లపాడు మండలం మైదవోలు గ్రామానికి చెందిన పల్లపు పోతురాజు ప్యాసింజర్ ఆటోను నడుపుకుంటూ మంగళవారం తెల్లవారుజామున చిలకలూరిపేట రజకకాలనీ వైపు నుంచి కృష్ణమహాల్ థియేటర్ వైపుకు వస్తున్నాడు. అదే మార్గంలోని పీఎస్–5 బార్అండ్ రెస్టారెంట్ వద్దకు వచ్చే సరికి వేగంగా ఉన్న ఆటో స్పీడ్ బ్రేకర్ ఎక్కించడంతో పక్కకు వాలింది. అదుపుతప్పి స్టీరింగ్ పట్టుజారిన పోతురాజు రోడ్డుపై పడ్డాడు. వెంటనే అతనిపై ఆటో పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి.స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారి నుంచి సమాచారం అందుకున్న 108 సిబ్బంది గుంటూరు సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పోతురాజు(38) మృతి చెందాడు. భార్య పావని ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతిడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గ్రామాల్లో దాహార్తి తీరుస్తాం

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్
- గండిగనుమలకు త్వరలో నీటి సరఫరా

సాక్షి ఎఫెక్ట్

బొల్లాపల్లి : నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న గ్రామాల్లో సత్వరమే చర్యలు తీసుకుంటామని గ్రామీణ నీటిసరఫరా విభాగం ఎస్ఈ వి.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని గండిగనుమల, దోమలగుండం, సోలాయపాలెం గ్రామాలను ఆయన స్థానిక అధికారులతో కలిసి సందర్శించారు. గండిగనుమలలో నీటి సమస్యపై ఆదివారం నాటి సాక్షిదినపత్రికలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి సమాయత్తమయ్యారు. మంగళవారం ఆయా గ్రామాల్లో మినీట్యాంక్‌లు, సింగిల్ ఫేజ్ మోటర్లను పరిశీలించారు. గ్రామాల్లో ప్రస్తుతం నెలకొన్న నీటి సమస్య గురించి స్థానిక అధికారులు, ఆయా గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నీటి సమస్య ఉన్న గండిగనుమల, దోమలగుండం గ్రామాల్లో ట్రాన్స్‌పోటేషన్ ద్వారా నీటి సరఫరా చేస్తామన్నారు. ప్రతిపాదనలు పంపి మంజూరు కాగానే ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా జరుగుతుందని వివరించారు. సచివాలయాలు, పంచాయతీల్లో గ్రామీణ నీటి సరఫరా నిధుల గురించి స్థానిక అధికారులు, సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. నీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, నిధుల కేటాయింపు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి కొరత లేకుండా చూసేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూస్ డీఈఈ ఆర్.ఎస్.హెచ్.కుమార్‌రాజా, ఇన్‌చార్జి ఎంపీడీవో పి. సీతారామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం. ఆకాష్‌నాయక్, సిబ్బంది, గ్రామపెద్దలు తదితరులు పరిశీలించిన వారిలో ఉన్నారు.



గండిగనుమలలో మోటార్లను పరిశీలిస్తున్న అధికారులు, ఇన్‌చార్జి ఎంపీడీవో, గ్రామపెద్దలు

మొక్కజొన్న పంట ఆశాజనకం

- జిల్లా వ్యవసాయ అధికారి మురళి
- జిల్లాలో ఎరువుల కొరత లేదు
- ఎరువులు ఎంఆర్‌పీ ధరలకు మించి అమ్మితే చర్యలు తీసుకుంటాం

శావల్యాపురం: మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉందని జిల్లా వ్యవసాయ అధికారి ఇంగిరాల మురళి అన్నారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శావల్యాపురంలో మొక్కజొన్న పంట పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించి రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మురళి మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న పంట సాగు 11 వేల 651 హెక్టార్లల్లో రైతులు సాగు చేశారన్నారు. జిల్లాలో ఎరువులు కొరత లేదని 45 వేల 750 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు ఉన్నాయని అందులో భాగంగా యూరియా నిల్వలు 14 వేల 550 మెట్రిక్ టన్నులు ఉందన్నారు. యూరియా ఎంఆర్‌పి ధరలకు మించి వ్యాపారస్తులు అమ్మకాలు జరిపితే రైతులు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు, కంది పంటను రైతుసేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని ప్రభుత్వ మద్దతూ ధర రూ.7550 రూపాయాలకు ప్రకటించినట్లు తెలిపారు. డ్రోన్ యంత్ర పరికరం ద్వారా పొలాల్లో రసాయనిక ఎరువులు పిచికారీ చేయడానికి ఒక్కో మండలానికి మూడు యూనిట్స్ ఎంపిక చేశామని, యూనిట్ విలువ రూ.10 లక్షలు ఉండగా, 80 శాతం రాయితీ గ్రూపు సభ్యులకు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. జిల్లాలో 51 యూనిట్స్ మంజూరు చేసి గ్రూపు సభ్యులకు శిక్షణా తరగతులు కూడా నిర్వహించామన్నారు. బహిరంగ మార్కెట్ ధర ఆధారంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 9700 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశామన్నారు.

పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించాలన్నారు. రైతులు సస్యరక్షణ చేపట్టి వ్యవసాయం చేయటం ద్వారా ఆశించినస్థాయిలో దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేసి సూచనలు సలహాలు ఇచ్చారు. ఆయనతో పాటు మండల వ్యవసాయ అధికారి రామినేని రామరావు, ఉద్యాన శాఖాధికారి షేక్ నబీ రసూల్, ఏఈవో పురేటి అశోక, వీఏఏలు రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మురళి

నేడు రవ్వారంలో తిరునాళ్ల వేడుకలు



మెట్ల పూజలు చేస్తున్న భక్తులు



స్వామి వారి అభరణాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నూజెండ్ల: మండలంలోని రవ్వవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీకొండ గురునాథ స్వామి తిరునాళ్ల సందర్భంగా మంగళవారం మెట్ల పూజ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నా రు. గొర్రెలు కాపరిదార్లు తమ జీవాలను స్వామి వారి ముఖద్వారం వరకు తీసుకొనివచ్చి దర్శించుకున్నారు. అలాగే స్వామివారికి అలంకరణ చేయనున్న కంఠాభరణాలను పురవీధుల్లో మేళ తాళాలతో ఊరేగింపుగా కొండపైకి తీసుకొని వెళ్ళి స్వామివారికి అలంకరణ చేశారు. తిరునాళ్ల పురస్కరించుకొని రెండు భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కొండ సమీపంలో ఎడ్ల పందాలు కూడా నిర్వహిస్తున్నారు. తిరునాళ్ల వేడుకల్లో భాగంగా ఐనవోలు ఎస్సై కృష్ణారావు భద్రత ఏర్పా ట్లు పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపు పార్కింగ్ సదుపాయాలు పరిధిలో రద్దీని నియంత్రణ చేసేందుకు గాను బార్కెట్ల బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. కొండ వద్దకు వాహనాలు రాకపోకలు నిలిపివేశామని, పార్కింగ్ ఏరియాలో వాహనాలు నిలుపుదల చేయాలని సూచించారు.

జన్మభూమి రుణం తీర్చుకోవడమూ అదృష్టమే

విద్యాప్రదాత గడుపూడి వెంకటరాయుడు

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో పార్టీలకు అతీతంగా గ్రామస్తులు ఐక్యంగా రూ. కోటి 50 లక్షల వ్యయంతో నూతన కళ్యాణ మండపం పనులు ముమ్మరంగా చేస్తున్నట్లు గ్రామ అభివృద్ధి ఔత్సాహికులు విద్యాప్రదాత గడుపూడి వెంకటరాయుడు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యాప్రదాత మాట్లాడుతూ జన్మభూమి రుణం తీర్చుకోవటం దేవుడు ఇచ్చిన వరమని అందులో భాగంగా ప్రతి ఒక్కరు జన్మభూమి స్ఫూర్తి కల్గియుండాలన్నారు. గ్రామానికి చెందిన అబ్బూరి శ్రీనివాసరావు, లింగా రాఘవయ్య కుటుంబ సభ్యులు తమ వంతు సహాయంగా 60 సెంట్లు స్థలాన్ని వితరణ చేయగా కల్యాణ మండపం పనుల్లో భాగంగా గ్రామస్తులు దాతల రూ. 50 లక్షల విరాళాలు రూపంలో అందజేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చొరవతో రూ. 40 లక్షలు మంజూరు అయ్యేలా చేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు సారథ్యంలో ప్రహరీ ,వంటశాల, విద్యుత్ తదితర పనులు నిమిత్తం రూ. 30 లక్షలు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ప్రస్తుతం హైదరాబాదులో వివిధ రంగాల్లో స్థిరపడిన వారందరూ యువత గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. గ్రామస్తులు, అధికారులు పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయన్నారు.



పోట్లూరులో నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపం

రుణాల చెల్లింపులు పారదర్శకంగా ఉండాలి

శావల్యాపురం: స్వయం సహాయక మహిళా సంఘాల్లో రుణాలు చెల్లింపులు పారదర్శకంగా జరగాలని ఏపీయం జి.వాసుబాబు అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామసమాఖ్యా సభ్యులు, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయం వాసుబాబు మాట్లాడుతూ స్త్రీనిధి రుణాలు లక్ష్యాలను అధిగమించామని, రీకవరి పురోగతి వేగవంతం చేయాలన్నారు. రుణాలు చెల్లింపులు చేసిన మహిళా సభ్యులకు రసీదులు ఇవ్వాలన్నారు. నెలవారి సమావేశాలు, పుస్తక నిర్వహణ, తదితరవన్నీ నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ఈసమావేశంలో మండల సమాఖ్యా అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి, సీసీలు ఖాజావలి, మేరికుమారి, సెక్రటరీ కుమారిలు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఈసీ జుబిలేషన్ 2కే25



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ జీపీ రాజు, ఎంవీ కోటేశ్వరరావు

నరసరావుపేట రూరల్: క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు టీం వర్క్ మెరుగుపర్చుకోవచ్చని జేఎన్‌టీయూఎస్ ఇంజినీరింగ్ కళాశాల ఫిజికల్ డైరక్టర్ డాక్టర్ జీపీ రాజు తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల జుబిలేషన్2 కే25లో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీలు ముగింపు వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసికంగా సమస్యలను ఎదుర్కొనే ధైర్యం లభిస్తుందన్నారు. దీంతో పాటు గుండెపోటు, షుగర్, బీపీ, క్యాన్సర్ వంటి వ్యాధులు దరిచేరవని తెలిపారు. మెదుడు ఉత్తేజంగా పనిచేస్తుందని, నాయకత్వ లక్షణాలు క్రీడల ద్వారా లభిస్తాయని తెలిపారు. కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించిన సాంస్కృతిక, సాంకేతిక, క్రీడల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, కళాశాల ఫిజికల్ డైరక్టర్ ఎల్.కృష్ణారెడ్డి, ఆంజనేయలు, విజయకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు

వాలీబాల్ పోటీలో సెయింటాన్స్, చీరాల (ప్రథమ), మోహనబాబు యూనివర్సిటీ, తిరుపతి (ద్వితీయ), క్రికెట్‌లో విజ్ఞాన్ యూనివర్సిటీ (ప్రథమ), కిట్స్‌కళాశాల, వింజనంపాడు (ద్వితీయ), కబడ్డీ పోటీలో బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల (ప్రథమ), ఎన్ఈసీ కళాశాల (ద్వితీయ) విజయం సాధించారు. మహిళల కబడ్డీ పోటీలలో ఎంఎఎం కళాశాల, కేసానుపల్లి (ప్రథమ), సెయింట్‌మేరీస్ కళాశాల, బుడంపాడు (ద్వితీయ), త్రోబాల్‌లో వీవీఐటీ, గుంటూరు (ప్రథమ), నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల (ద్వితీయ) బహుమతిని సాధించాయి. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

అందుబాటులోకి టెన్‌క్టిప్లస్ ఇంజెక్షన్

చిలకలూరిపేట: గుండెపోటు బారిన పడినవారికి వెంటనే అందించే టెన్‌క్టిప్లస్ ఇంజెక్షన్ అందుబాటులో ఉందని చిలకలూరిపేట ఏరియా ప్రభుత్వ వైద్యశాల ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో రూ. 45 వేలు విలువచేసే ఈ ఇంజెక్షన్‌ను రోగులకు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. గుండెపోటు లక్షణాలు కనిపించిన గంటలోపు (గోల్డెన్ అవర్) ఆసుపత్రికి రావాలన్నారు. గుండెదడ, ఎడమవైపు భుజం లాగడం, ఛాతీలో నొప్పి, ఉన్నట్టుండి ఆయాసం పెరగడం, స్పృహతప్పి పడిపోవడం గుండెపోటు లక్షణాలుగా భావించాలన్నారు. చిలకలూరిపేట పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్యం మత్తులో ఘర్షణ

నరసరావుపేట రూరల్: మద్యం మత్తులో ఇరువురి మధ్య ఘర్షణలో ఒకరు గాయపడిన ఘటన ఉప్పలపాడులో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామానికి చెందిన కందుకూరి జక్రయ మద్యం మత్తులో కందుల రమేష్‌పై దాడికి పాల్పడ్డాడు. గాయపడిన రమేష్‌ను ఏరియా వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. రమేష్ ఫిర్యాదు మేరకు జక్రయ్యపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ కిశోర్ తెలిపారు.